RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -4 సంచిక -5 05 శనివారం సెప్టెంబర్ 2026 ఎడిటర్ లక్ష్మి నారాయణ




పేజీలు - 6 వెల రూ 5 /--

## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

**-కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్-కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన**

**-మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్-ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం**

**-ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం**



ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన

**-వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు అందుబాటులోకి రావాలని ఆదేశం**

**-భూములిచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్న సీఎం**



# ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

**-అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు! -మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్**

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు.

ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

**భారత స్థిరత్వం కీలకం**

భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు.

**రక్షణ బంధం మరింత బలోపేతం**

భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు.

**వరుస పర్యటనలతో బంధం బలోపేతం**

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

**క్వాడ్‌పై అమెరికా ప్రత్యేక ఆసక్తి**



భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యాన్ని విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు చేస్తాం

ప్రభుత్వం సంక్షేమ పథకాల కింద అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు అక్రమంగా అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా హెచ్చరించారు. పేదల ఆకలి తీర్చడానికి ఉద్దేశించిన బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పూతాని తండాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు.

కొంతమంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని బయట అమ్ముకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. ఇది చాలా తప్పుడు పద్ధతని, పేదల కోసం ఉద్దేశించిన పథకాలను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి, వారి రేషన్ కార్డులను రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని తేల్చి చెప్పారు.

ఇక, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారికి తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఇళ్ల కేటాయింపులో పార్టీలకు అతీతంగా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచులు తమ పదవులు కోల్పోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు.

ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదై పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తీవ్ర కరువు పరిస్థితులు ఎదురుకావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పామాయిల్ పంట సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. పామాయిల్ సాగు చేసేవారికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని భరోసా ఇచ్చారు.

రైతులకు భరోసా కల్పిస్తూ, రఘునాథపాలెం మండలానికి శుక్రవారం రాత్రికే సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతులు మరుసటి రోజు మోటార్లు ఆన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్నవారికి బోరుబావుల అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, మండలంలో రూ.75 కోట్లతో 200 డంపర్ రోడ్లతో పాటు పొలాలకు వెళ్లే దారులను నిర్మిస్తామని ప్రకటించారు. విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ఆయన, త్వరలోనే ఒక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# వెయ్యి రోజుల పాలన.. హామీలన్నీ గాలికే!

## -ఆరు గ్యారంటీలు ఎక్కడ? కాంగ్రెస్‌కు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూటి ప్రశ్నలు





**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 4:-**
రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, మంచాల మండలం ఆరుట్ల గ్రామం: బీఆర్ఎస్ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో మాత్రం ప్రజలకు నిరాశే మిగిలిందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజుల్లో ప్రజలకు చేసిందేమిటని ప్రశ్నించారు. మహిళలకు తులం బంగారం, నెలకు రూ. 2,500, స్కూటీలు వంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రూ. 500కే వంటగ్యాస్ ఇస్తామని చెప్పి.. ప్రస్తుతం సిలిండర్ ధర భారంగా మారిందని విమర్శించారు. పెన్షన్ల పెంపు, బీసీ బంధు, ఎస్సీ బంధు, కేసీఆర్ కిట్ వంటి పథకాల విషయంలో కూడా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, కాంగ్రెస్ పాలనలో కొత్తగా కనిపించే అభివృద్ధి ఏమీ లేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా కౌన్సిలర్లు, యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్లమ్మ ఆలయంలో హుండీ చోరీ.. తండ్రి కొడుకు అరెస్ట్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 4:-
ఆదిభట్ల: రావిర్యాల గ్రామంలోని సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయంలో హుండీ చోరీకి పాల్పడిన తండ్రి, కొడుకును ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 26/27వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయానికి అమర్చిన గొలుసును కత్తిరించి లోపలికి ప్రవేశించి నగదుతో ఉన్న హుండీని అపహరించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ మీగడ కాశీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఆలయంలోని నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించగా, ఆగస్టు 27న తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 3న బొంగుళూరు సమీపంలో టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై తిరుగుతున్న కాలివాల రోహిత్, అతని తండ్రి సోమ్రాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడు రోహిత్‌పై గతంలోనే పలు ఆలయాల్లో చోరీలకు సంబంధించిన కేసులు ఉన్నాయని, మొత్తం 17 కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి చోరీకి గురైన హుండీ, రూ. 12,120 నగదు, సుమారు 90 తులాల బరువున్న కరిగించిన వెండి కడ్డీతో పాటు నేరానికి ఉపయోగించిన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

# చిన్ని కృష్ణుల సందడి.. ఎలిమినేడులో వేడుకల వెల్లువ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 4:-
ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని గ్రామంలోని చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల పాత్రలను ధరించి తమదైన శైలిలో ప్రదర్శనలు ఇవ్వడంతో కార్యక్రమ ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. చిన్నారుల కోసం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. చిన్నారులు కృష్ణుడి జీవిత విశేషాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉల్లాసంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని కొట్టేందుకు ప్రయత్నించగా, అక్కడికి వచ్చిన వారు కేరింతలు, చప్పట్లతో వారిని ప్రోత్సహించారు. భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను చిన్నారులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో పండుగ కార్యక్రమాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ పండుగల ప్రాధాన్యతను పిల్లలకు తెలియజేయడంతో పాటు, మన సంస్కృతిని భవిష్యత్ తరాలకు



చేరవేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లల ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు.



గ్రామానికి చెందిన పలువురు ప్రజలు కూడా పాల్గొని చిన్నారులను అభినందించారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

# సామాజిక మాధ్యమాన్ని నిఘా సాధనంగా మార్చిన పోలీసులు

## -ముచ్చర్లలో తప్పిన పెను విషాదం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 4:-
మహేశ్వరం: ఓ యువకుడి జీవితంలో చీకట్లు కమ్ముకున్న వేళ.. సామాజిక మాధ్యమంలో చేసిన ఒక్క పోస్టు పోలీసులకు సంకేతంగా మారింది. క్షణం ఆలస్యమైనా ప్రాణం పోయే పరిస్థితుల్లో పోలీసులు వేగంగా స్పందించి యువకుడిని గుర్తించి సురక్షితంగా కాపాడారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో జరిగిన ఈ ఘటన పోలీసుల అప్రమత్తతకు నిదర్శనంగా నిలిచింది. సెప్టెంబర్ 4న సాయంత్రం 4.59 గంటల సమయంలో కొల్లపాడకల్ గ్రామానికి చెందిన 23 ఏళ్ల చేపంగి కిషోర్ ఇన్‌స్టాగ్రామ్‌లో తాను ఆత్మహత్యకు పాల్పడబోతున్నట్లు కథనం పెట్టాడు. ఈ విషయం పోలీసుల దృష్టికి రావడంతో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ సైబర్ నేరాల విభాగం అధికారులు వెంటనే సాంకేతిక ఆధారాలతో యువకుడి ఆచూకీని గుర్తించే ప్రయత్నం చేశారు. అతడు హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నట్లు గుర్తించి స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న సెక్టార్ ఎస్ఐ జి. సైదులు వెంటనే పెట్రోల్ మొబైల్ సిబ్బందితో కలిసి ముచ్చర్ల గ్రామ శివార్లలో గాలింపు చేపట్టారు. చివరకు కిషోర్‌ను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ ఘటనకు తావులేకుండా సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ప్రేమ విఫలమవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు కిషోర్ తెలిపాడు. బోనాల పండుగ సందర్భంగా మేనమామ గ్రామమైన ముచ్చర్లకు వచ్చినట్లు వెల్లడించాడు. అనంతరం యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించి, వారికి పోలీసులు కౌన్సెలింగ్‌తో పాటు తగిన సూచనలు చేశారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి యువకుడి ప్రాణాలను కాపాడిన ఎస్ఐ జి. సైదులు, పెట్రోల్ మొబైల్ సిబ్బంది ఏ. ప్రశాంత్, పి. శ్రీనివాస్, పి. చంద్రశేఖర్‌లను స్థానికులు అభినందించారు.

# వాకర్స్ ఇంటర్నేషనల్ 40వ వార్షికోత్సవాలకు భారీ ఏర్పాట్లు

## - నవంబర్‌లో సేవా కార్యక్రమాలు, ర్యాలీ.. - సన్నాహక సమావేశంలో నిర్ణయం

హనుమకొండ, సెప్టెంబర్ 4 హైదరాబాద్ ఎస్టేట్: వాకర్స్ ఇంటర్నేషనల్ 40వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరమయ్యాయి. నవంబర్‌లో భారీ కార్యక్రమంతోపాటు వివిధ సేవా, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో వాకర్స్ ఇంటర్నేషనల్ 303 గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి క్లబ్‌లో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడంతోపాటు రక్తదానం, మొక్కల నాటడం, వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వాదోపవాద, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ పి. రవి రాజు మార్గదర్శకాలకు అనుగుణంగా



కార్యక్రమాలను నిర్వహించాలని, అన్ని క్లబ్‌ల సభ్యుల భాగస్వామ్యంతో రోడ్డు ర్యాలీ చేపట్టాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు, మున్సిపల్, కళారంగ ప్రముఖులను ఆహ్వానించి సీనియర్ వాకర్స్, సేవా రంగంలో విశేష కృషి చేసిన వారిని సన్మానించాలని పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణలో ప్రతి ఖర్చును కమిటీ పర్యవేక్షణలో పారదర్శకంగా చేపట్టనున్నట్లు సమావేశంలో తెలిపారు. వివిధ వాకర్స్ క్లబ్‌లు, అసోసియేషన్ల ప్రతినిధులు తమ సూచనలు అందించగా, వాటిని పరిగణనలోకి తీసుకుని నవంబర్‌లో భారీ స్థాయిలో 40వ



వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించనున్నారు. సమావేశంలో జంగా గోపాల్ రెడ్డి, తడక కుమారస్వామి గౌడ్, పచ్చిమట్ల ఎల్ల గౌడ్, చాడా దశరథ రామిరెడ్డి, దొంతి తిరుపతి రెడ్డి, వంగ రాజిరెడ్డి, పడాల సోమయ్య, రవీందర్ రెడ్డి, సిద్ధార్థ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట, గీసుకొండ, నర్సంపేట ప్రాంతాలకు చెందిన వివిధ వాకర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు సహా సుమారు 90 మంది హాజరయ్యారు.

# ఘనంగా పెద్దమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు

**-భక్తి పారవశ్యంలో తుమ్మలూరు ఐదవ వార్డ్ మెంబర్ ఏనుగుల కరుణాకర్**



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 04:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరు గ్రామంలో పెద్దమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగాయి. తుమ్మలూరు ఐదో వార్డు మెంబర్ కరుణాకర్ అమ్మవారికి కుటుంబ సమేతంగా బోనాన్ని సమర్పించడం జరిగింది తుమ్మలూరు గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో ఉండాలని తుమ్మలూరు ఐదో వార్డ్ మెంబర్ కరుణాకర్ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాన్ని కుటుంబ సమేతంగా సమర్పించడం జరిగింది సర్పంచ్

# సిద్ధార్థ గురుకులంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**- అమ్మాయిలే ఉట్టి కొట్టడం ప్రత్యేక ఆకర్షణ**

చెన్నారావుపేట, సెప్టెంబర్ 4 హైదరాబాద్ ఎస్టేట్: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని సిద్ధార్థ గురుకుల విద్యాలయంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. విశాలమైన క్రీడా ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసారి వేడుకల్లో అమ్మాయిలు ప్రత్యేకంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొనడం విశేషంగా నిలిచింది. పదో తరగతి విద్యార్థిని ఎన్. సృజన ఉట్టి కొట్టి విజయం సాధించింది. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి, డైరెక్టర్ మాధవరెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి.



# 1000 రోజుల ప్రజాపాలన – అభివృద్ధి, సంక్షేమం, మార్పుకు దర్శనం

## - మహేశ్వరం పట్టణ కేంద్రంలోకాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విజయోత్సవ వేడుకలు

## - 1000 రోజుల పాలనలో కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితం

( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 04: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం పట్టణ కేంద్రంలో.. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) ఆదేశాల మేరకు మండల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, మరియు మార్కెట్ కమిటీ వైస్ ౘైర్మన్ యాదయ్య, నేనావత్ రాజు నాయక్ మహేశ్వరం మండల్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు మరియు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఆధ్వర్యంలో.. శుక్రవారం ఉదయం కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజా పాలన సందర్భంగా.. మన్సాన్పల్లి చౌరస్తా నుండి మహేశ్వరం అంబేద్కర్ విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీతో బాణాసంచలు టపాకాయలు పేల్చుతూ అక్కడికి చేరుకోవడం జరిగింది అనంతరం మీడియాతో నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ప్రజలకు అన్ని కులాలకు సమన్యాయం చేకూర్చే విధంగా ప్రజా పాలన సాగుతుంది అని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల చేత ఎన్నికైన ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ దాదాపు 1000 రోజులుగా ప్రభుత్వ జీతభత్యాలు తీసుకుంటూ అసెంబ్లీకి రాకుండా ప్రజల్లోకి వెళ్లకుండా ఉండటం సిగ్గుచేటు అని అన్నారు. ప్రభుత్వ జీతం తీసుకుని అసెంబ్లీకి కానీ ప్రజల్లోకి రాని ప్రతిపక్ష నేత చంద్రశేఖర రావు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజాపాలనతో ముందుకు సాగుతున్న ఈ చారిత్రాత్మక సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను గత ప్రభుత్వ పాలనకు భిన్నంగా తెలంగాణలో ప్రజల సంక్షేమం అభివృద్ధి సామాజిక న్యాయం ప్రధాన లక్ష్యాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు ప్రజాపాలనాలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరియు మహిళలు రైతులు యువత విద్యార్థులు పేద కుటుంబాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని వివరించారు గత ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల చేత ఎన్నిక ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ దాదాపు వెయ్యి రోజులుగా ప్రభుత్వ జీతభత్యాలు తీసుకుంటూ అసెంబ్లీకి రాకుండా ప్రజల్లోకి వెళ్లకుండా ఉండటం సిగ్గుచేటని ప్రజలు ఓటు వేసి గెలిపించింది ప్రజల మధ్య ఉండటానికా?...లేక ఫామ్ హౌస్ లో?... ఇంటికే పరిమితం కావడానికి...? అసెంబ్లీకి హాజరుకాకుండా నియోజకవర్గ సమస్యలను పట్టించుకోకుండా ప్రజా జీవితానికి దూరంగా ఉండే ప్రభుత్వ జీతం తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని నాయకులు అన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల ప్రజా పాలన

రైతులకు 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పెట్టుబడి సహాయం, 200 యూనిట్ల కరెంటు, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, 500 కే గ్యాస్, ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ప్రభుత్వ ఉద్యోగాలు, భారత్ ఫ్యూచర్ సిటీ, లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం



అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఉండి ప్రజలకు పథకాలు అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా నాయకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల మాజీ అధ్యక్షులు కాకి ఈశ్వర్, ఆలయ కమిటీ ౘైర్మన్ అల్లే కుమార్, సర్పంచులు రాజు చిన్న తుప్పర గోపాల్ నాయక్, దేవేందర్ నాయక్, మరియు ఉపసర్పంచ్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నందిగామ నరసింహ, పాండు నాయక్, మోహన్ నాయక్, నరసింహ యాదవ్, అంజయ్య యాదవ్ శ్రీశైలం యాదవ్, శీను ప్రకాష్ మరియు యువకులు కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ యొక్క కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది

# పాడి గేదెలతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

## - ఆత్మకూరు, దామెర మండలాలకు 96 యూనిట్ల మంజూరు పత్రాలు పంపిణీ

పరకాల, సెప్టెంబర్ 4 హైదరాబాద్ ఎస్టేట్:
పాడి గేదెల పెంపకంతో పేద కుటుంబాలకు అదనపు ఆదాయం కల్పించి ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన దళిత కుటుంబాలకు 96 పాడి గేదెల యూనిట్ల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పరకాల ఇందిరా మహిళా డైరీ ద్వారా వచ్చే రెండేళ్లలో సుమారు 40 వేల కుటుంబాలకు ఒక్కో ఇంటికి రెండు గేదెలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆత్మకూరు మండలానికి 72, దామెర మండలానికి 24 యూనిట్లు మంజూరు



చేసినట్లు చెప్పారు. ఒక్కో యూనిట్ విలువ రూ.2 లక్షలు కాగా రూ.1.60 లక్షలు సబ్సిడీ, రూ.40 వేల బ్యాంకు రుణంగా అందిస్తున్నట్లు వివరించారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సకాలంలో టీకాలు, వైద్యం, పోషకాహారం అందిస్తే పాల ఉత్పత్తి పెరిగి కుటుంబాలకు మరింత ఆదాయం సమకూరుతుందని అన్నారు. అంతకుముందు పశువైద్యులు లబ్ధిదారులకు పశువుల పెంపకం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు

# ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి

## -వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి ప్రజా సంఘాల వినతి

హన్మకొండ జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధ నౌఖ గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే ఎమ్మెల్యే ఫార్వర్డ్ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో గద్దరన్న పాత్ర కీలకమైందని అలాంటి గద్దరన్న ఆశయ సాధనలో భాగంగా ఆయన విగ్రహాలను రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకొని పీడిత ప్రజల విముక్తిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటి ౘైర్మన్ కోంధ్ర నర్సింగరావు, బిసి జాక్ నాయకులు డాక్టర్ తిరునహరి శేషు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ ౘైర్మన్ సాయిని నరేందర్, డి బి ఎఫ్ రాష్ట్ర



ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి

# హబ్సిగూడ డివిజన్ కన్వీనర్‌గా చింతకింది ప్రవీణ్

## వైభవంగా గణేష్ ఉత్సవాల నిర్వహణే లక్ష్యం: చింతకింది ప్రవీణ్

ఉప్పల్ సెప్టెంబర్ 04 ():
భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హబ్సిగూడ డివిజన్ కన్వీనర్‌గా చింతకింది ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రామంతపూర్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు తిందేరు హనుమంతరావు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ కన్వీనర్ ఏనుగు రాజిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు రమేష్ తదితరులు ప్రవీణ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో హబ్సిగూడ డివిజన్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన సమితి పెద్దలకు, నాయకులకు చింతకింది ప్రవీణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో, ఘనంగా మరియు వైభవంగా నిర్వహించేందుకు అందరినీ కలుపుకొని కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, ఉత్సవాలు ప్రశాంతంగా, క్రమశిక్షణతో జరిగేలా సమితి సభ్యులు, నిర్వాహకులు మరియు భక్తులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు రుద్ర శేఖర్, మాలకొండ రెడ్డి, సోమ శ్రీనివాస్ గుప్త, రామేశ్వరరావు, ఓబుల్ రెడ్డి, చెల్లోజు ఎల్లాచారి, వార్ల బాలరాజు, రాపోలు సాయినాథ్, కొండేరు స్రవంతి తదితరులు పాల్గొని చింతకింది ప్రవీణ్‌కు అభినందనలు తెలిపారు.



# ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిసిన గుండు సుధారాణి

## - కుడా ౘైర్మన్‌గా నియమితులైన సందర్భంగా అభినందనలు

హనుమకొండ, సెప్టెంబర్ 4 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ౘైర్మన్‌గా నియమితులైన గుండు సుధారాణి శుక్రవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రామకృష్ణ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి గుండు సుధారాణిని శాలువాతో సత్కరించి, కుడా ౘైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



# 1,000 రోజుల కాంగ్రెస్ పాలనపై మడికొండలో సంబరాలు

## - కేక్ కట్ చేసిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

మడికొండ, సెప్టెంబర్ 4 హైదరాబాద్ ఎస్టేట్:
కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గం 45వ డివిజన్‌లోని మడికొండ జంక్షన్‌లో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్ర హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, కర్ర హరీష్‌రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇనగాల మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ఎన్నికల హామీల అమలుకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.




# గురువులే సమాజానికి మార్గదర్శకులు

## ఎంపీ రవిచంద్ర- జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు

హనుమకొండ, సెప్టెంబర్ 4 హైదరాబాద్ ఎస్టేట్:
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు జ్ఞానంతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుత జీవన విధానాన్ని నేర్పించే మార్గదర్శకులే గురువులని పేర్కొన్నారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఉపాధ్యాయ వృత్తికి దేశం ఇచ్చే గౌరవానికి ప్రతీక అని అన్నారు. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, రాధాకృష్ణన్ ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులు, యువత రాధాకృష్ణన్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఉపాధ్యాయులందరికీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



# హామీలు కొండంతా.... అమలు శూన్యం...

## కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై మాజీ ఎమ్మెల్యే గండ్ర ద్వజం...

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్ తేది: 04.09.2026చిట్యాల మండలం.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి విమర్శించారు.

1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బిఆర్ఎస్ పార్టీ సమరబేరి కార్యక్రమంలో భాగంగా చిట్యాల మండల కేంద్రంలో మహిళలకు రూ.2500, కేసిఆర్ కిట్,కళ్యాణలక్ష్మి షాదీముభారక్ (తులం బంగారం),విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వని ప్రభుత్వానికి నిరసనగా వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సదస్సు మరియు వంట వార్పు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ....

కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలు, వృద్ధులు, రైతులు, యువత, వికలాంగులు సహా అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే 1000 రోజులు గడిచినా ఆ హామీలు అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు.

మహిళలకు రూ.2500 ఆర్థిక సహాయం, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్, రైతులకు రూ.15 వేల రైతు భరోసా వంటి హామీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక వాగ్దానాలను అమలు చేయాలని మాత్రమే ప్రతిపక్షంగా తాము ప్రశ్నిస్తున్నామని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల దగా పాలనకు నిరసనగా వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని 6 గ్యారెంటీలు 420 హామీలు అమలు మాత్రం శూన్యం అనే ప్రజల ఆవేదనను ఫ్లెక్సీల రూపంలో ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా పెడితే, ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. ఫ్లెక్సీలను తొలగించడం ద్వారా ప్రజల ఆలోచనలను అణచివేయలేరని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును, ప్రజల ఆవేదనను అణచివేయడం సరికాదన్నారు. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనై అతిగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. తప్పుడు కేసులతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టడం సాధ్యం కాదని, భారత రాజ్యాంగం మరియు న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు.

భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మీడియా ప్రతినిధులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాపై జరిగిన దాడి ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము



పోలీసు అధికారులను కోరామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తు చేశారు. గతంలో విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడిన తెలంగాణ ప్రజలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు.

ప్రస్తుతం మళ్లీ విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు.

ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన పరిస్థితి అని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ ఆరోపణలు చేస్తూ కాలయాపన చేయడం మానుకుని, రైతుల ప్రయోజనాల కోసం వెంటనే పంపులను నడిపించాలని డిమాండ్ చేశారు. గోదావరిలో నీరు ప్రవహిస్తున్నప్పటికి పంపులను ఆన్ చేయకపోవడం వల్ల రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు.

తాము అధికారంలో ఉన్న సమయంలో ఎండాకాలంలో కూడా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించి పంటలను కాపాడిన చరిత్ర ఉందని గుర్తు చేశారు.

రైతులు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే వారు కాదని, కష్టపడి పంటలు పండించుకునే స్వభావం రైతులదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎన్నికల హామీలను అమలు చేయడంతో పాటు, కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను నడిపి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

అదే విదంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మహిళలు, వృద్దులు, వికలాంగులు మరియు చిట్యాల,టేకుమట్ల, మొగుళ్ళపల్లి మండలాల మరియు భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# అభినందన మాల

**శ్రీ శ్రీ శ్రీ బజరంగు చరణదాసు తిరుపతి బాలాజీ మహారాజు గారికి**
**శతకోటి వందనాలతో... సాదర అభినందన మాల! పూజ్యనీయులు, పరమ గౌరవనీయులు, ఆధ్యాత్మిక సేవామూర్తులు,**
**శ్రీ శ్రీ శ్రీ బజరంగు చరణదాసు తిరుపతి బాలాజీ మహారాజు గారికి నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.**

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్ అయోధ్య పవిత్ర రామజన్మభూమి నిర్మాణ ట్రస్ట్‌కు సంబంధించిన గొప్ప బాధ్యతలను నిర్వర్తిస్తూ, ధర్మ పరిరక్షణకు, ఆధ్యాత్మిక సేవలకు, సమాజ సేవకు తమ జీవితాన్ని అంకితం చేస్తున్న మహనీయులు బాలాజీ స్వామిగారు.

యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో పాండిచ్చేరిలో ఆగస్టు 29వ తేదీన నిర్వహించిన విశిష్ట కార్యక్రమానికి బాలాజీ స్వామిగారు ముఖ్య అతిథిగా విచ్చేసి, పలువురికి గౌరవ డాక్టరేట్ పురస్కారాలను తమ చేతుల మీదుగా అందజేయడం ఎంతో గర్వకారణమైన విషయం.

అంతేకాకుండా, అనంతరం తమిళనాడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గారు మరియు అమెరికన్ యూనివర్సిటీ శ్రీ మతి వైస్ ఛాన్సలర్ గారి చేతుల మీదుగా శ్రీ బాలాజీ స్వామిగారు కూడా గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడం వారి సేవలకు, ఆధ్యాత్మిక కృషికి లభించిన మరొక గొప్ప గౌరవంగా భావిస్తున్నాము.

బాలాజీ స్వామిగారి జ్ఞానం, సేవా తపన, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం మరింత విస్తరించి, భవిష్యత్తులో




ఇలాంటి ఎన్నో గౌరవ డాక్టరేట్లు, పురస్కారాలు, సత్కారాలు అందుకోవాలని ఆ పరమాత్మ శ్రీరామచంద్రుని, శ్రీవేంకటేశ్వర స్వామివారిని మనసారా ప్రార్థిస్తున్నాను.

# అవంతి కళాశాలలో వైభవంగా 'శ్రీకృష్ణ జన్మాష్టమి' వేడుకలు





బర్కత్‌పుర, సెప్టెంబర్ 04: బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ ఢ పీజీ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, అధ్యాపకులు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణాన్ని సంప్రదాయబద్ధంగా ముస్తాబు చేయగా, విద్యార్థులు, అధ్యాపక బృందం సంప్రదాయ వస్త్రధారణతో హాజరై వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. యువతలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని, విద్యార్థుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వేడుకల్లో భాగంగా విద్యార్థులకు ఉట్టి కొట్టడం (దహీ హండీ), కుండల అలంకరణ (మట్కీ డెకరేషన్), శ్రీకృష్ణుడి విశేషాలపై క్విజ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు కళాశాల యాజమాన్యం ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేసింది.

కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధ్యాపకులను, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజు, వైస్-ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేణుగోపాల్ ప్రత్యేకంగా అభినందించారు. సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పిన ఈ వేడుకలు విద్యార్థుల కోలాహలం మధ్య ముగిశాయి.

# పాఠశాల బస్సు రూపంలో మృత్యువు.. మహిళ బలి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 4:-

బి.ఎన్.రెడ్డి నగర్ లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. భర్త, ఇద్దరు పసి పిల్లలతో కలిసి స్కూటీపై వెళ్తున్న ఓ మహిళను వెనుక నుంచి వచ్చిన పాఠశాల బస్సు ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇంజాపూర్‌లోని వినాయక నగర్‌కు చెందిన 32 ఏళ్ల భాగ్యలత అలియాస్ వాణి ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తోంది. సెప్టెంబర్ 3న సాయంత్రం తన భర్త సురేందర్, రెండేళ్ల కుమార్తె దాక్షాయని, ఏడాది వయసున్న మరో చిన్నారి భవిజ్ఞతో కలిసి స్కూటీపై ఇంజాపూర్ నుంచి బీఎన్ రెడ్డి నగర్ వైపు బయలుదేరింది. లైఫ్ కేర్ ఆసుపత్రి సమీపంలోకి రాగానే వారి వెనుక నుంచి వచ్చిన మాంచెస్టర్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు స్కూటీని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో భాగ్యలత రోడ్డుపై పడిపోగా బస్సు చక్రాలు ఆమెపై నుంచి వెళ్లడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. భర్త, ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కామినేని ఆసుపత్రి, అనంతరం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయినప్పటికీ వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు. సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 1.10 గంటలకు భాగ్యలత మృతి చెందింది. మృతురాలి తండ్రి నర్సన్న ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తల్లిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులను చూసి కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు.



# బ్రహ్మకుమారీస్ కాచిగూడ శాఖలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ఆకట్టుకున్న చిన్నారుల రాధాకృష్ణుల రూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు**
**దైవీ గుణాలు అలవర్చుకోవడమే నిజమైన జన్మాష్టమి: కేంద్ర ఇన్‌చార్జ్ సోదరి ప్రశాంతి దీదీ**



కాచిగూడ, సెప్టెంబర్ 04:
ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కాచిగూడ శాఖలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో ఏర్పాటు చేసిన మనోహరమైన ప్రదర్శన (ఝాంకీ) భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింబిస్తూ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా సేవా కేంద్రం ఇన్‌చార్జ్ సోదరి ప్రశాంతి దీదీ ప్రవచనమిస్తూ.. శ్రీకృష్ణుడి వలె 16 కళలతో సంపూర్ణులం కావాలంటే ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో దైవీ గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. మనసులో సద్గుణాలు జన్మించినప్పుడే నిజమైన జన్మాష్టమి సాకారమవుతుందని పేర్కొన్నారు. అనంతరం భక్తులంతా ఉత్సాహంగా రాసలీలలో పాల్గొని పరస్పరం జన్మాష్టమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ ప్రశాంతి దీదీ, రూప, అఖిల, శ్రీలత, కాంగ్రెస్ పార్టీ కాచిగూడ డివిజన్ అధ్యక్షులు కైరం కొండ శ్రీ కాంత్, స్థానిక సోదర, సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు.. చోరీకి స్కెచ్!

## -షాద్‌నగర్‌లో నిందితుడి అరెస్ట్.. చోరీ సొత్తు స్వాధీనం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 4:-

షాద్‌నగర్: తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రివేళల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని షాద్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. సీసీ కెమెరాల దృశ్యాలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించిన పోలీసులు అతని నుంచి చోరీకి గురైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

కేశంపేట మండలానికి చెందిన ఓ కుటుంబం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. ఇదే విషయాన్ని గమనించిన నిందితుడు రాత్రి సమయంలో ఇంట్లోకి ప్రవేశించి విలువైన వస్తువులను అపహరించాడు. ఇంట్లో ఉన్న ఐఫోన్, ఆపిల్ వాచ్‌తో పాటు రూ.20 వేల నగదును తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. తిరిగి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడంతో పాటు సాంకేతిక సమాచారాన్ని విశ్లేషించారు. దర్యాప్తులో రోహిత్ కుమార్ (23) ప్రమేయం ఉన్నట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

విచారణ అనంతరం నిందితుడి వద్ద నుంచి ఒక ఐఫోన్, ఒక ఆపిల్ వాచ్, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బిహార్‌కు చెందిన రోహిత్ కుమార్ ప్రస్తుతం కొత్తూరు ప్రాంతంలో నివసిస్తూ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. డీసీపీ సీ. సిరీష, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ఈ కేసును పోలీసులు ఛేదించారు

# కొండా సురేఖను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

## పార్టీలో ఉంటూ నాయకత్వంపైనే విమర్శలా? -గీసుకొండ మండల కాంగ్రెస్ నాయకుల డిమాండ్

గీసుకొండ, సెప్టెంబర్ 4 హైదరాబాద్ ఎస్టేట్: కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపిస్తూ కొండా సురేఖపై అధిష్ఠానం కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని గీసుకొండ మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని ఆరోపిస్తూ ఆమెను పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. పార్టీలో కొనసాగుతూనే ముఖ్యమంత్రి, పార్టీ నాయకత్వంపై బహిరంగ విమర్శలు చేయడం సరికాదని నాయకులు పేర్కొన్నారు. పార్టీపై విశ్వాసం లేకుంటే స్వచ్ఛందంగా పార్టీని వీడాలని, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను అధిష్ఠానం ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దాడి శివ మాట్లాడుతూ, పార్టీలో ఉంటూనే నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం క్రమశిక్షణకు విరుద్ధమన్నారు. రాజకీయ సవాళ్లు విసరడం కంటే ప్రజాక్షేత్రంలో తన సత్తాను నిరూపించుకోవాలని పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి మాట్లాడుతూ, వ్యక్తిగత రాజకీయాల కోసం పార్టీ వేదికను ఉపయోగించడం సరికాదన్నారు. పార్టీ ప్రయోజనాలు, ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే వారిపై అధిష్ఠానం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధుల పనితీరుకు వయసు కొలమానం కాదన్నారు. ప్రజలకు అందించే సేవలు, నియోజకవర్గ అభివృద్ధే అసలైన కొలమానమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కొండా సురేఖపై క్రమశిక్షణ చర్యలు



తీసుకోవాలని గీసుకొండ మండల కాంగ్రెస్ పార్టీ తరఫున ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వాన్ని కలిసి విజ్ఞప్తి చేస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో చాడ కొమురారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల రుద్రప్రసాద్, సర్పంచులు కక్కెర్ల సుభాష్, బానోతు వీరేందర్, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, పత్తిపాక రవీందర్, మర్రి క్రాంతి, కొమ్ము శ్రీకాంత్, కూసం రమేష్, నాగరాజు, బిట్ల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దగా పాలనకు "వంటా వార్పు"తో సెగ పుట్టించిన బీఆర్ఎస్ శ్రేణులు

**-మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**

**-ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను రానున్న ఎన్నికల్లో మహిళలు బొంద పెట్టడం ఖాయం**

**-- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి దేవరకొండ
కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు బీఆర్ఎస్ శ్రేణులు చేపడుతున్న వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు కొండమల్లెపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద "వంటా వార్పు" కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా



కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని, మహిళలకు స్కూటీలు ఇస్తామని చెప్పి పట్టించుకోలేదని, కళ్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని ఆయన అన్నారు. మహిళలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత పాలనపై మహిళల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని, ఇచ్చిన హామీలను



అమలు చేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రమావత్ రవీంద్ర కుమార్ హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మహిళలే తగిన బుద్ధి చెబుతారని, ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని మహిళలు బొంద పెట్టడం ఖాయమని రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి

## -వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి ప్రజా సంఘాల వినతి

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
హన్మకొండ జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధ నౌఖ గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే ఎమ్మెల్యే ఫార్వర్డ్ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో గద్దరన్న పాత్ర కీలకమైందని అలాంటి గద్దరన్న ఆశయ సాధనలో భాగంగా ఆయన విగ్రహాలను రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకొని పీడిత ప్రజల విముక్తిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటీ చైర్మన్ కోంఢ్ర నర్సింగరావు, బిసి జాక్



నాయకులు డాక్టర్ తిరునహరి శేషు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోకులానికి 'చక్రవర్తి' చేయూత!

**- శ్రీకృష్ణాష్టమి వేళ రూ.10,116 విరాళం- భక్తితో పూజలు.. సేవతో విరాళం!**

**- సేవాభావం చాటుకున్న తాడాల చక్రవర్తి--రాజరాజేశ్వరి దంపతులు**

కడియం
భక్తి భావంతో శ్రీకృష్ణుడిని కొలిచి.. సేవా స్ఫూర్తితో గోకులం నిర్వహణకు విరాళం అందించారు తాడాల విష్ణు చక్రవర్తి--రాజరాజేశ్వరి దంపతులు. కడియం మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని గోకులంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వైసీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ తాడాల విష్ణు చక్రవర్తి, రాజరాజేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. అనంతరం గోకులం నిర్వహణ, గోసేవ కోసం తమ వంతు సహాయంగా రూ.10,116 విరాళాన్ని అందజేశారు. భక్తి కార్యక్రమాలతో పాటు గోసేవకు చేయూతనివ్వడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు.
అదేవిధంగా గోకుల ఫౌండర్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు-రామకృష్ణతులసి దంపతులు కుటుంబ సభ్యులు సాయి సుబ్రహ్మణ్య చేతన్, సాయి దుర్గా కుసుమ, అరవింద్ రాజ్‌లతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, భక్తులతో కలిసి శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా తాడాల విష్ణుచక్రవర్తి--రాజరాజేశ్వరి దంపతులు భక్తులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచే ఆలయానికి పెద్ద



సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణ నామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది

# మట్టిలో మాణిక్యం చదువులో చాణక్యం

## తెలంగాణ ఉద్యమకారుడు వెంకటేష్ గౌడ్

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి నల్గొండ
తెలంగాణ టాప్ వన్ అయినా గాంధీ మెడికల్ కాలేజీలో సీటు సాధించిన పుట్టపాక యువతి. శివశెట్టి అదితి. ఒక మారుమూల గ్రామంలో సాధారణ కుటుంబంలో జన్మించిన అదితి గ్రామానికి మరియు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ట లు సంపాదించిన కూతురుగా నిలిచారని కళాకారుడు వెంకటేష్ గౌడ్ కొనియాడారు . అదితి తండ్రి శివశెట్టి శ్రీనివాస్ ను కలిసి అభినందన తెలియజేశారు .నీట్ ఎగ్జామ్ లో నేషనల్ లెవెల్ లో 611మార్కు సంపాదిం చి నేషనల్ 7073 ర్యాంకు .స్టేట్ 114 ర్యాంకు సాధించి తెలంగాణలోని టాప్ వన్ మెడికల్ కాలేజైనటువంటి . గాంధీ మెడికల్ కాలేజ్ లో సీట్ సంపాదించటం గొప్ప విషయమని అన్నారు తన ప్రతిభను కనపర్చి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడంతో యువతకు ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు.



# మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

హైదరాబాద్ స్టేట్ మద్దిరాల (ప్రతినిధి)
ప్రజా పాలన ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మద్దిరాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆదేశాల మేరకు, మద్దిరాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పచ్చిపాల వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో, మండల సేవాదళ్ అధ్యక్షులు వల్లపు రమేష్ యాదవ్ తదితర కాంగ్రెస్ నాయకుల కాంగ్రెస్ పార్టీ ఉప సర్పంచ్ కసనబోయిన లింగమ్మ వార్డ్ మెంబర్లు సమక్షంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.



అనంతరం అధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రతి అర్హమైన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత పారదర్శకంగా అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, పేద మరియు అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా పాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు మరియు ప్రజలు పాల్గొన్నారు

# తుమ్మలూర్ గ్రామంలో పెద్దమ్మ బోనాల ఉత్సవాలు



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 04:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరు గ్రామంలో పెద్దమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగాయి. పోతురాజుల ఆటలతో శివసత్తుల పూనకాలతో పెద్దమ్మ తల్లికి అంగరంగ వైభవంగా బోనాలను సమర్పించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కదా రాజమౌని రాజు ముదిరాజ్ రాజమౌని నారాయణ ముదిరాజ్ రాజమౌని బిక్షపతి రాజమౌని రాజు రాజమౌని శివ తోకల కుమార శివశక్తి హంస ఏనుగుల రాములు అమ్మవారి బోనాలు ఉత్సవాల్లో పాల్గొనడం జరిగింది తుమ్మలూరు గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో ఉండాలని తుమ్మలూరు పెద్దమ్మ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించడం జరిగింది

# శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు

మన్సురాబాద్‌లోని శ్రీ కృష్ణ దేవాలయంలో శ్రీ కొప్పుల నరసింహ రెడ్డి గారు ప్రత్యేక పూజలు నిర్వహించి,శ్రీకృష్ణ స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోచబోయిన సత్యనారాయణ యాదవ్, గణేష్ యాదవ్, బీజేపీ అధ్యక్షుడు హరీష్ రెడ్డి, గోపి యాదవ్, రవి యాదవ్, నగేష్ యాదవ్, భాస్కర్ యాదవ్, అఖిల్ యాదవ్, రాజేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతగా సాక అనిత.

కడియం మండలంలోని మండల ప్రజా పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల వెంకాయమ్మపేట (కడియపులంక పంచాయతీపరిధి ) సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న సాక అనిత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ఆమె శనివారం అవార్డును అందుకోనున్నారు. తరగతి గదిలో టీ ఎల్ ఎం ద్వారా వినూత్నంగా విద్యాబోధన చేయడం, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అలాగే కరోనా కష్టకాలంలో కరోనా బారిన పడిన పేదలకు ఆహారం పంపిణీ చేయడంతో పాటు, తుఫాను బాధిత ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందిస్తూ సామాజిక సేవలోనూ తన వంతు బాధ్యతను నిర్వర్తించారు. ఈ సేవా కార్యక్రమాలే ఆమెను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడంలో కీలకంగా నిలిచాయి.

# స్రవంతి అరవింద్ రెడ్డికి ఎమ్మెల్యే మాణిక్ రావు జన్మదిన శుభాకాంక్షలు

కోహీర్:సెప్టెంబర్ 4
మాజీ కోహీర్ జెడ్పీటీసీ, పిచేర్యాగడి పీఏసీఎస్ చైర్మన్ స్రవంతి అరవింద్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు స్రవంతి అరవింద్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్లు అల్లాడి నర్సింలు, తంజిం, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని స్రవంతి అరవింద్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




# మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన

తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చి నెలలోగా వేగవంతంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి... కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ, వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

# అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం: జగన్

2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్‌ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.

# మహిళా సాధికారతే లక్ష్యం

**-హుగ్గెల్లీలో వివేకానంద ఇన్స్‌స్టూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభం**

జహీరాబాద్ సెప్టెంబరు
మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి స్వశక్తితో ఎదగాలనే లక్ష్యంతో వివేకానంద ఇన్స్‌స్టూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో, కోల్ ఇండియా కంపెనీ వారి ఆర్థిక సహాయంతో హుగ్గెల్లీ గ్రామంలో మహిళా సాధికారత - నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ విమల శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రత్యేక చొరవ, విజ్ఞప్తి మేరకు ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య ఆమె మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఇంటి వద్దే ఉంటూ స్వయం ఉపాధి పొందేందుకు ఇలాంటి సాంకేతిక, వృత్తి విద్యా శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. సామాజిక బాధ్యతతో కోల్ ఇండియా సహకారంతో వివేకానంద ఇన్స్‌స్టూట్ ఈ శిక్షణ అందించడం అభినందనీయమని కొనియాడారు. మొదటి బ్యాచ్



కింద ఎంపికైన 30 మంది మహిళలకు 60 రోజుల పాటు నిపుణులచే ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వనున్నారని, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా కుట్టు మిషన్లను అందజేస్తారని తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. గ్రామంలో ఇలాంటి ఉపయోగకరమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించిన సర్పంచ్ విమల శ్రీనివాస్‌రెడ్డిని, సహకరించిన సంస్థ ప్రతినిధులను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి,ఉప సర్పంచ్ కె.మహిపాల్,వార్డు సభ్యులు బాల్ రాజ్,ఎం.రూత్,సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్, మరియు,నిర్వాహకులు మరియు గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెంగాల్ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుగా మిథున్ చక్రవర్తి నియామకం

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారు (కల్చరల్ అడ్వైజర్)గా బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి నియమితుడయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సువేందు అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. కోల్‌కతా శివారులోని న్యూ టౌన్‌లో 'ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్' నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం సువేందు అధికారి మాట్లాడుతూ.. రూ.25 కోట్ల వ్యయంతో ఈ ఫిలిం సెంటర్‌ను నిర్మిస్తున్నామని, ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర సమాచార, సాంస్కృతిక శాఖ ఇప్పటికే మంజూరు చేసిందని తెలిపారు. ఫిలిం సెంటర్ డిజైన్‌ను ఖరారు చేసే బాధ్యతను పూర్తిగా బెంగాలీ సినీ రంగ నిపుణులకే అప్పగిస్తామని, ప్రభుత్వం ఇందులో ఎలాంటి జోక్యం చేసుకోదని ఆయన స్పష్టం చేశారు. "ఈ రంగంతో సంబంధం ఉన్నవారికే ఆ పనిలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. మా పని కేవలం మద్దతు ఇవ్వడమే. ప్రతి విషయంలో జోక్యం చేసుకోవడం సరికాదు" అని సీఎం అన్నారు. కోల్‌కతాలోని ప్రఖ్యాత నందన్ కల్చరల్ సెంటర్ మాదిరిగా ఈ కొత్త ఫిలిం సెంటర్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో 750 సీట్ల సామర్థ్యంతో రెండు సినిమా హాళ్లు, ఒక ప్రివ్యూ థియేటర్, ఫుడ్ కోర్ట్, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. రెండో విభాగంలో 1,000 సీట్ల ఆడిటోరియం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఓపెన్-ఎయిర్ థియేటర్ ఉంటాయి. మూడో విభాగంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, పోస్ట్-ప్రొడక్షన్ కోసం అత్యాధునిక ల్యాబొరేటరీలు, స్టూడియోలు నిర్మిస్తారు. ఇప్పటికే సాయిల్ టెస్టింగ్, స్థల ఎంపిక పూర్తయ్యాయని, డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) ప్రక్రియ కొనసాగుతోందని సీఎం వివరించారు. వర్షాకాలం ముగిసిన వెంటనే పశ్చిమ బెంగాల్ హౌసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు. సెప్టెంబర్ 6 వరకు టాలీవుడ్ (బెంగాలీ చిత్ర పరిశ్రమ) కు చెందిన పలువురు ప్రముఖులను సన్మానించనున్నట్లు, ఈ సన్మాన గ్రహీతల ఎంపికలో కూడా ప్రభుత్వం జోక్యం చేసుకోదని, సినీ పరిశ్రమ కమిటీయే ఆ బాధ్యత తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

# 45 రోజుల లక్ష్యం ముందే పూర్తి..

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) చేపట్టిన బృహత్తర ప్రచార కార్యక్రమం 'ఇంటింటికీ తెలుగుదేశం -- 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' రికార్డు స్థాయిలో విజయవంతంగా కొనసాగుతోంది. 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటినీ పలకరించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, నిర్దేశిత గడువు కంటే ముందే కోటికి పైగా కుటుంబాలను సందర్శించి చారిత్రక మైలురాయిని అందుకుంది. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తూనే, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగింది.

ఈ చారిత్రక విజయంపై టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణుల కృషిని అభినందిస్తూ ఆయన ప్రత్యేకంగా స్పందించారు. "ఇంటింటికీ తెలుగుదేశం-2026 కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా కోటికి పైగా ఇళ్లకు తీసుకెళ్లిన కార్యకర్తలు, నేతలకు హృదయపూర్వక అభినందనలు. ఇంటింటి పర్యటనల్లో ప్రజలను కలిసి, ప్రభుత్వ పథకాలను వివరించిన తీరు అద్భుతం. కేవలం సందర్శించడమే కాకుండా, ఆయా కుటుంబాల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన తెలుగుదేశం కుటుంబానికి ధన్యవాదాలు" అని లోకేశ్ పేర్కొన్నారు.

కార్యక్రమ నేపథ్యం, ప్రస్థానం

వాస్తవానికి ఈ కార్యక్రమానికి జూన్‌లోనే బీజం పడింది. చంద్రబాబు జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు "సైకిల్ పవర్ చూపుదాం... ప్రజలకు చేరువవుదాం" నినాదంతో ఇంటింటి ప్రచారం చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సవరించిన షెడ్యూలును ప్రకటించారు. జులై 27 నుంచి 45 రోజుల పాటు నిరంతరాయంగా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ప్రారంభానికి ఒకరోజు ముందు, జులై 26న చంద్రబాబు నాయుడు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అనుకున్నట్టుగానే జులై 27న నారా లోకేశ్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ఈ మహాయజ్ఞం ప్రారంభమైంది.

లక్ష్యాలు, సాధించిన ప్రగతి

కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత,



యువతకు ఉపాధి వంటి అంశాలను ప్రజలకు వివరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. దీంతో పాటు, గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను స్పష్టం చేస్తూ, ప్రజల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరించడం, తద్వారా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ యాత్ర పురోగతి అంచనాలను మించి సాగింది.

కీలక మైలురాళ్లు

ప్రారంభం (జులై 27): రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం ఉత్సాహంగా మొదలైంది.

2వ రోజు (జులై 28): 2.18 లక్షల ఇళ్లను సందర్శించారు. కుప్పంలో నారా భువనేశ్వరి ప్రచారంలో చురుగ్గా పాల్గొని కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపారు.

8వ రోజు (ఆగస్టు 3): సందర్శించిన ఇళ్ల సంఖ్య 20.61 లక్షలకు చేరింది.

13వ రోజు (ఆగస్టు 8): ఒక్క రోజే 3.56 లక్షల ఇళ్లను సందర్శించడంతో, మొత్తం సంఖ్య 37.21 లక్షలకు పెరిగింది.

21వ రోజు (ఆగస్టు 16): 61.61 లక్షలతో 60 లక్షల ఇళ్ల మైలురాయిని దాటింది.

37వ రోజు (సెప్టెంబర్ 1): 97.32 లక్షల ఇళ్లను సందర్శించి, కోటి ఇళ్ల లక్ష్యానికి చేరువైంది.

39వ రోజు (సెప్టెంబర్ 3): 99.85 లక్షల కుటుంబాలను పలకరించి, కోటి మైలురాయికి అత్యంత సమీపానికి వచ్చింది.

40వ రోజు (సెప్టెంబర్ 4): విజయవంతంగా కోటి మార్కును అధిగమించింది.

నాయకత్వం, క్షేత్రస్థాయి పర్యవేక్షణ

ఈ కార్యక్రమం విజయవంతం కావడం వెనుక నారా లోకేశ్ పర్యవేక్షణ కీలక పాత్ర పోషించింది. ఆయన మొదటి నుంచి టెక్నాలజీని ఉపయోగించి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పురోగతిని సమీక్షిస్తూ, అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి గ్రామస్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం, కూటమిలోని ఇతర పక్షాలతో సమన్వయం చేసుకోవడంలో లోకేశ్ వ్యూహం ఫలించింది.

ప్రతిపక్షాల విమర్శలు, టీడీపీ స్పందన

అయితే, ఈ కార్యక్రమంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' వంటి హామీలు పూర్తిగా అమలు కాలేదని, వాటిని అయినట్టుగా ప్రచారం చేసుకునే ప్రయత్నమే ఇదని వారు ఆరోపించారు. ఈ విమర్శలపై టీడీపీ స్పందిస్తూ, రెండేళ్లలో సాధించిన పురోగతిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వాస్తవ గణాంకాలతో ప్రజల ముందు ఉంచుతున్నామని, ఇది కేవలం ప్రచారం కాదని, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి పాలనను మరింత మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన కార్యక్రమమని స్పష్టం చేసింది.

మొత్తం మీద, "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపడంతో పాటు, ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు టీడీపీకి ఒక బలమైన వేదిక లభించింది. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన ఫీడ్‌బ్యాక్‌తో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ఠమైన వ్యూహంతో సిద్ధమయ్యేందుకు టీడీపీకి మార్గం సుగమమైంది.